క్లుప్తంగా

ఖరీఫ్ పనులు ప్రారంభం



చుక్కమెట్టులో పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు

కొందుర్గు: సరైన సమయంలో వర్షాలు కురిశాయని రైతన్నలు పునాస సాగును ప్రారంభించారు. వర్షాలు అనుకూలంగా కురిస్తే రోహిణీ, మృగశిర కార్తెలలో విత్తనాలు నాటడానికి రైతన్నలు మొగ్గుచూపుతారు. ఈ కార్తెలలో విత్తనాలు నాటితే అధిక దిగుబడులు వస్తాయని రైతన్నల నమ్మకం. అయితే మరో వారంలో జుల్లో రోహిణీ కార్తె పూర్తయి, మృగశిర కార్తె ఆరంభమవుతుంది. ఈ సందర్భంగా ఆదివారం కురిసిన వర్షానికి కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని పలు గ్రామాల్లో జొన్న, పత్తి విత్తనాలు నాటారు.

జోగులాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



అనుచరులతో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొత్తూరు: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డి సోమవారం అలంపూర్‌లో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన జోగులాంబ స్వామివారిని దర్శించుకున్నారు. ఇందులో భాగంగా కొత్తూరుకు చెందిన ముఖ్య అనుచరులతో కలిసి ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శివాచారి, తుప్పర రవీందర్, సాగర్, గణేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొరత లేకుండా చూడాలి



విత్తనాల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కొందుర్గు: విత్తనాల కొరత లేకుండా రైతులు కోరిన విత్తనాలను విక్రయించాలని ఏడీఏ రాజారత్నం సూచించారు. ఆదివారం మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు విక్రయించిన రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, బిల్లుపై కాల పరిమితి, ధర, లాట్ నెంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శిరీష, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్సై కృష్ణయ్య పాల్గొన్నారు.

యాకథాన్‌లో కేఎల్ యూనివర్సిటీకి బహుమతి



యాకథాన్‌లో బహుమతి అందుకుంటున్న విద్యార్థులు, తదితరులు

మొయినాబాద్‌రూరల్: యాకథాన్‌లో నిర్వహించిన టీ హబ్‌లో కేఎల్ యూనివర్సిటీ 3వ బహుమతి రావడం అభినందనీయమని కేఎల్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ అన్నారు. మండలంలోని అజీజ్‌నగర్ సమీపంలో గల ఆ యూనివర్సిటీలో 3వ బహుమతి వచ్చిన సందర్భంగా సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారధివర్మ మాట్లాడుతూ.. యాకథాన్‌లో ప్రతిష్టాత్మకమైన రీతిలో మూడో బహుమతి గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. ఐడియా, ల్యాబ్స్, టీహబ్ తెలంగాణ ప్రభుత్వం నుంచి మద్దతుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఐ పరిశ్రమ సవాళ్లను పరిష్కరించడానికి దేశవ్యాప్తంగా 1700 జట్లు వినూత్న రీతిలో పాల్గొన్నాయన్నారు. అందులో 30 గంటల ఆన్‌లైన్ యాకథాన్‌కు 37 మాత్రమే ఎంపిక చేయబడ్డాయని ఈ ఎలైట్ టీమ్‌లో కేఎల్ అజీజ్‌నగర్ క్యాంపస్ ప్రాతినిధ్యం వహిస్తూ 3వ స్థానాన్ని గెలుపొందడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

అందుబాటులోకి అండర్‌పాస్

- మరికొన్ని రోజుల్లో ప్రారంభం
- వై జంక్షన్ కూడలిలో తగ్గనున్న ప్రమాదాలు
- ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న అధికారులు



వై జంక్షన్ కూడలి

కొత్తూరు: ఆ కూడలి గుండా ప్రయాణించే వాహనాలు గంటకు వందకు పైగా వేగంతో ప్రయాణిస్తాయి. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోవడం రెప్పపాటు కాలంలో జరుగుతాయి. ఇప్పటికే వందల సంఖ్యలో ప్రమాదాలు జరిగితే ఆ కూడలిలో పదుల సంఖ్యలో వాహనదారులు మృత్యువాతపడ్డారు. మరెంతో మంది క్షతగాత్రులుగా మారారు. ఇక్కడ జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా అధికారులు, స్థానికులు కొత్తూరు పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న వై జంక్షన్, పెంజర్ల కూడళ్లను డేంజర్ సర్కిల్‌గా గుర్తించారు. దీంతో కూడలిలో ప్రమాదాల నివారణకు అండర్ పాస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

మరికొన్ని రోజుల్లో అండర్ పాస్ ప్రారంభం..

జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా 2009లో కొత్తూరు నుంచి షాద్‌నగర్ సమీపంలోని సోలీపూర్ గేటు వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డును ఏర్పాటు చేశారు. కాగా అప్పట్లో ఆయా కూడళ్ల వద్ద వాహనాలు దాటేందుకు వీలుగా ఎక్కడా అండర్‌పాస్, వంతెనలు నిర్మించలేదు. దీంతో కొత్తూరులోని చేగూరు రోడ్డు, వైజంక్షన్, పెంజర్ల, జేపీదర్గా కూడళ్ల వద్ద ప్రమాదాల తీవ్రత చాలా పెరిగింది. ప్రమాదాల తీరుపై అటు ఎన్‌హెచ్ఏఐ అధికారులు, ఇటు పోలీసులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి పలు సర్కిళ్లను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. చివరగా ప్రమాదాల నివారణకు పలు కూడళ్లను మూసివేశారు. కొన్నిచోట్ల అండర్‌పాస్ నిర్మాణాలకు ప్రతిపాదించారు. ఇందులో భాగంగా నాలుగేళ్ల క్రితం కొత్తూరు పట్టణ సమీపంలోని వైజంక్షన్ కూడలిలో అండర్‌పాస్ నిర్మాణానికి రూ.14.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో ప్రారంభమైన అండర్‌పాస్ పనులు పలు దఫాలుగా చేయడంతో ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. మరో వారం రోజుల్లో వంతెన ప్రారంభించేందుకు పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

తగ్గనున్న ప్రమాదాలు..

హైదరాబాద్‌తో పాటు ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు కొత్తూరు పాత జాతీయ రహదారి మీదుగా వచ్చేందుకు వై జంక్షన్ కూడలిలో రోడ్డు దాటాలి. అదే సమయంలో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనాలు సైతం అదే కూడలిని దాటాలి. ఈ క్రమంలో ఏ ఒక్క వాహనదారుడు అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అండర్‌పాస్ పనులు పూర్తికావడంతో కొత్తూరు పాత జాతీయ రహదారి గుండా ప్రయాణించే వాహనదారులు వంతెన కింది నుంచి రాకపోకలు కొనసాగిస్తారు. దీనికి తోడు పెంజర్ల కూడలిని మూసివేయడంతో చాలా వరకు ప్రమాదాలు తగ్గిపోతాయని అధికారులు పేర్కొంటున్నారు.



చివరి దశలో ఉన్న అండర్‌పాస్ పనులు



పూర్తయిన బీటీరోడ్డు, వీధిదీపాల ఏర్పాటు

ప్రమాదాల నివారణకు సహకరించాలి



రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలి. ప్రస్తుతం వై జంక్షన్ సమీపంలోని అండర్‌పాస్‌ను మరికొన్ని రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రారంభం తర్వాత ట్రాఫిక్, వాహనాల రాకపోకలను గమనిస్తామన్నారు. ఇప్పటికే పెంజర్ల కూడలిని మూసివేశాం. అండర్‌పాస్ గుండా వాహనాల రాకపోకలు సక్రమంగా జరిగితే చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయి.

– నర్సింహారావు, సీఐ, కొత్తూరు

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

లోక్ ఆదాలత్‌లో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

చేవెళ్ల: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించి కేసులు లేకుండా చూసుకోవాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో రిటైర్డు జడ్జి సాంబశివరావు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ట్రాఫిక్ పోలీసుల కేసుల లోక్ అదాలత్ సోమవారం మూడోరోజు కొనసాగింది. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. మూడోరోజు లోక్ అదాలత్‌లో 55 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పరిష్కరించి రూ.1,41,500ల జరిమానా విధించినట్లు రిటైర్డ్ జడ్జి సాంబశివరావు తెలిపారు. చేవెళ్లలో జరుగుతున్న లోక్ అదాలత్‌ను రాజేంద్రనగర్ ఏసీపీ బాలాజీ వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడే ఉన్న వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డుపైకి వాహనంలో వచ్చామంటే దానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలని దీంతో పాటు ట్రాఫిక్‌రూల్స్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపించటం చట్టరీత్యా నేరమని అలా దొరికితే కేసులు నమోదవుతాయని చెప్పారు. ఇప్పటికే కేసులు నమోదైన వాహనాదారుల కోసమే ఈ లోక్ అదాలత్‌లో కొనసాగుతున్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేసులు లేకుండా పరిష్కరించుకునేందుకు ఇవీ చక్కటి మార్గాలని చెప్పారు. లోక్ అదాలత్‌ను ట్రాఫిక్ కేసుల పరిష్కారం కోసమే ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 7వ తేదీవరకు ఈ లోక్ అదాలత్ ఉంటుందని ఇంకా ఎవరైనా పెండింగ్ కేసులు ఉన్నవారు ఉంటే వచ్చి పరిష్కరించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్ఐ విఠల్‌రెడ్డి, కానిస్టేబుల్ కవిత, కోర్టు సిబ్బంది, వాహనదారులు ఉన్నారు.



వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

పార్టీలకతీతంగా ఏకతాటిపైకి రావాలి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్

షాబాద్: రైతులు పార్టీలకతీతంగా ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా రైతాంగం ఏకం కావాలన్నారు. మండలంలో భారతీయ కిసాన్ సంఘ్ పటిష్ట గ్రామ కమిటీలతో ఉందన్నారు. మండలంలోని 20 గ్రామాల్లో భారతీయ కిసాన్ సంఘ్ కమిటీలు పనిచేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వరిధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయని కారణంగా రైతులు తక్కువ ధరకు మిల్లర్లకు అమ్ముకొని నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

బీటీ పత్తి సాగు చేయడం నేరం..

రైతులు బీటీ పత్తి విత్తనాన్ని సాగు చేయొద్దని ఏఓ వెంకటేశం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో గతంలో బీటీ సాగు చేశారని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని విత్తన విక్రయదారులకు కూడా ఈ విషయాన్ని తెలపాలన్నారు. రైతులు విత్తనం కొనుగోలు చేసే సమయంలో రశీదులు తప్పక తీసుకోవాలని సూచించిరు. కార్యక్రమంలో ఏఈఓ సోనిశ్రీ, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, మండల కార్యవర్గ సభ్యుడు చంద్రబాబు, వివిధ గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, రైతులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్, తదితరులు

కోరం లేక మండల సమావేశం వాయిదా

- 17 మందికి నలుగురు ఎంపీటీసీలు మాత్రమే హాజరు
- తిరిగి మళ్లీ నిర్వహిస్తామని ఎంపీడీఓ సంధ్య వెల్లడి

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి మూడు నెలలకోసారి జరిగాల్సిన మొయినాబాద్ మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీటీసీల కోరం లేక వాయిదా పడింది. సభ నిర్వహణకు అవసరమైన ఎంపీటీసీ సభ్యులు లేకపోవటంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ సంధ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉందని తెలిపినా మొత్తం 17 మంది ఎంపీటీసీలకు నలుగురే పాల్గొన్నారు. ఇందులో ఎంపీపీ నక్షత్రం జేవంతు, వైస్ ఎంపీపీ మమత, శ్రీరామ్‌నగర్ ఎంపీటీసీ రాంరెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మోర శ్రీనివాస్‌లు ఉన్నారు. కావాల్సిన కోరం లేకపోవడంతో సభ గంటసేపు నిలిపివేస్తున్నామని ఎంపీఓ అనిత 12 గంటలకు తెలియజేశారు. తిరిగి ఒంటి గంట తరువాత కూడా సభకు ఎంపీటీసీలు రాకపోవడంతో ఈ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తూ మళ్లీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశం ఉందని ముందస్తుగానే ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, మండల అధికారులకు తెలియజేసినా సమయ పాలన పాటించకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ప్రజాప్రతినిధులు అటూ ఇటూ అయినా అధికారులు మాత్రం మూడునెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి సమయానికి రాకపోవడం అధికారుల పనితీరు ఇంతేనా అని పలువురు పేర్కొంటున్నారు. మండల సర్వసభ్య సమావేశం త్వరలో నిర్వహిస్తామని ఎంపీడీఓ సంధ్య తెలిపారు. సమావేశంలో మండల విద్యాధికారి వెంకటయ్య, విద్యుత్ అధికారులు అమూనాయక్, పశువైద్య అధికారులు శ్రీలతరెడ్డి, దేవిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తారాబాయి, రంజిత్, శివకుమార్, సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కోరం లేక నిలిపివేస్తున్నట్లు తెలుపుతున్న ఎంపీడీఓ సంధ్య

ఉద్యమకారులకు సముచిత స్థానం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఉద్యమకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఉద్యమకారులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను ఏనాడు గుర్తించలేదన్నారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించారని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా రాష్ట్రం కోసం పోరాడిన ప్రతీ ఉద్యమకారుడికి గుర్తింపు లభించే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజుగౌడ్, జనార్ధన్, నక్క బాల్‌రాజు, కరుణాకర్, దిలీప్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఏఓ గోపాల్

నందిగామ: రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి గోపాల్ హెచ్చరించారు. మండల పరిధిలోని చేగూరులోని పలు విత్తన దుకాణాలను స్థానిక ఎస్సై గోపాలకృష్ణతో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ గోపాల్ మాట్లాడుతూ.. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు విత్తనాలను అమ్మొద్దని, అదే విధంగా నకిలీ విత్తనాలు విక్రయించొద్దని సూచించారు. విత్తనాలు విక్రయించే ముందు తప్పనిసరిగా రైతులకు రసీదు ఇవ్వాలని దుకాణాదారులకు సూచించారు. దుకాణాల్లో రికార్డులను, సరుకు నిల్వలను తనిఖీ చేశారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ లక్ష్మయ్య, పోలీస్, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విత్తనాల దుకాణంలో స్టాక్ నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయ, పోలీస్ అధికారులు

బడిబాటను విజయవంతం చేయాలి

ఎంపీడీఓ బాలశంకర్

మంచాల: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. సోమవారం మంచాల మండల కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఈనెల 6వ తేదీ నుంచి గ్రామాల్లో నిర్వహించే బడిబాట కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో బడీడు పిల్లలందరూ బడిలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అందరం బాధ్యతగా ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ వెంకట్‌రెడ్డి, సూపరింటెండెంట్ జంగయ్య, సీఆర్‌పీలు గిరీశ్, జగదీశ్, స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాలశంకర్

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు నేడు(మంగళవారం)డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ ఉష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు, ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలను ఈ 9959226287 ఫోన్ నంబర్ ద్వారా విన్నవించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

ఉద్యోగులకు బదిలీ సహజం



మేనేజర్ కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులకు బదిలీలు సహజమని విఠ్యాల మాజీ సర్పంచ్ జయశ్రీచంద్రశేఖర్ అన్నారు. పట్టణంలో మహబూబ్‌నగర్ రోడ్డులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కృష్ణారెడ్డి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డిని సోమవారం జయశ్రీచంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించి వారి మన్ననలను అందుకున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తాహేర్, మొయినొద్దీన్, రాజు, విజేందర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

యాచారం: మండలంలోని మొండిగౌరెల్లి గ్రామంలో పునర్నిర్మాణం చేపడుతున్న స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పనులకు డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సోమవారం రూ.2 లక్షల 51 వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి రూ.5,11,113లు విరాళం అందజేస్తానని గతంలో సత్తయ్య హామీ ఇచ్చారు. మొదట్లో కొంత నగదు అందజేయగా, సోమవారం మిగతా మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌గుప్తాకు అందజేశారు. రూ.2 కోట్లకుపైగా నిధులతో గ్రామస్తులు ఆలయ పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు.

బోనమెత్తి.. అమ్మకు సమర్పించి

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరులో పెద్దమ్మతల్లి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఐదేళ్లకొకసారి అమ్మవారికి ప్రత్యేక పూజలతో బోనాలు సమర్పించే ఆనవాయితీ ఉంది. ఈ మేరకు ఆదివారం రాత్రి డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ముదిరాజ్ కులపెద్దలు కృష్ణముదిరాజ్, సుద్దుల నర్సింహాముదిరాజ్, లక్ష్మయ్య, అంజయ్య, నర్సింహ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో వెళ్తున్న మహిళలు